క్లుప్తంగా

జేవీవీ కరపత్రాల ఆవిష్కరణ



తిరువూరు: వేసవిలో దాహార్తి తీర్చుకోడానికి శీతల పానీయాలు సేవించవద్దని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం శీతల పానీయాలు–నష్టాలు అంశంపై జేవీవీ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శీతల పానీయాల్లో హానికరమైన రసాయనాలున్నాయని, ఇవి ఆరోగ్యానికి భంగం కలిగిస్తాయని చెప్పారు. నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీళ్ల తీసుకోవచ్చన్నారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. హరికృష్ణ, సభ్యులు రాంప్రదీప్, సుదర్శన్, సుధాకర్, సైదులు, జగన్మోహనరావు, శోభన్ బాబు, సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జంట నాగుల విగ్రహ ప్రతిష్ఠ



తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ఆదివారం జంట నాగుల విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దాములూరు సత్యనారాయణ శర్మ, వేద పండితులు శివయ్య శాస్త్రి, వంశీ కృష్ణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు, గణపతికి, నవగ్రహాలకు, సర్పసూక్త నక్షత్ర హోమం నిర్వహించారు. ఆలయంలో ఇంతవరకు 36 జంట నాగుల విగ్రహాల ప్రతిష్ఠ జరిగిందని ఆలయ నిర్వాహకులు వూటుకూరు నారాయణరావు తెలిపారు.

పేపర్ క్రాఫ్ట్ తయారీలో శిక్షణ



తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ తయారీలో శిక్షణ ఇచ్చారు. కాగితం పువ్వులు, అలంకార వస్తువులు, ఫ్లాష్ కార్డులు, క్యాలెండర్లను తయారు చేసే విధానాన్ని గ్రంథాలయాధికారి శ్రీలత వివరించారు. తాము తయారు చేసిన పేపర్ క్రాఫ్ట్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. తిరువూరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో ఆదివారం దేశభక్తి గీతాల పోటీలను నిర్వహించారు. పుస్తక పఠనం, చెప్పుకోండి చూద్దాం, ఆరోగ్యం కోసం నవ్వు తదితర కార్యక్రమాలు జరిగాయి.

నేత్రపర్వంగా సంప్రదాయ నృత్యాలు

విజయవాడ కల్చరల్: జేఎంఎస్ యోగ భారతి (అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్) ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా జీవీఆర్ సంగీత కళాశాలలో ఆదివారం నిర్వహించిన సంప్రదాయ నృత్యహేల కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. యువ నాట్యాచారిణులు జంగం మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తి పర్యవేక్షణలో చిన్నారులు పలు సంప్రదాయ అంశాలను ప్రదర్శించారు. పూర్వంగంతో ప్రారంభించి, నర్తనగణపతిం, జెంజెతనన, అపదరోకు(జావళి) సంచరధర(జయదేవుని అష్టపది), భామాకలాపం, బృందావన నిలయే, కృష్ణశబ్దం, సందెకాడపుట్టి, ముద్దుగారే యశోద, గోవిందాశ్రిత, చేరియశోదకు అంశాలను ప్రదర్శించి మంగళంతో ముగించారు. 40 మంది చిన్నారులు నృత్య కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్వాహకుడు జంగం శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ సంప్రదాయ నృత్య కళలను పరిరక్షించుకోవాలని సూచించారు. బాల బాలికలలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. విజయకుమార్ మాట్లాడుతూ చిన్నారులకు నృత్యంలో శిక్షణ ఇస్తున్న జంగం సిస్టర్స్ కృషిని అభినందించారు.

స్పృహ తప్పి పడిపోయిన వ్యక్తి మృతి

జి.కొండూరు: స్పృహ తప్పి రోడ్డుపై పడిన వ్యక్తి తలకు బలమైన గాయమై చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జి.కొండూరు మండల పరిధి కుంటముక్కల గ్రామానికి చెందిన షేక్ కొండబాబు (32) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొండబాబుకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా కొండబాబు ఆదివారం సాయంత్రం మూడు గంటల సమయంలో ఇంటి నుంచి స్కూటీపై మైలవరం వైపు వెళ్లాడు. గ్రామంలో కొంత దూరం వెళ్లగానే కళ్లు తిరిగినట్లు అనిపించి స్కూటీని రోడ్డుపై నిలిపి కిందకు దిగి నిలబడ్డాడు. ఈ క్రమంలో స్పృహ తప్పి కిందపడిపోయిన కొండబాబు తలకి బలమైన గాయమైంది. స్థానికులు కొండబాబుని మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొండబాబు మృతి చెందాడు. మృతుడి భార్య షేక్ షబానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీమా.. ఏదీ ధీమా?

- పశు బీమాపై ఆసక్తి చూపని పాడి రైతులు
- ప్రయోజనం తక్కువ, ప్రీమియం కాల పరిమితి ఎక్కువ
- తక్కువ టార్గెట్‌లు పూర్తి చేసేందుకు ఇబ్బంది పడుతున్న అధికారులు
- ఉచిత బీమా ఇస్తే ప్రతి పాడి రైతులకు లబ్ధి



వెలగలేరు గ్రామంలో బీమా చేయించిన పాడి గేదెను చూపుతున్న రైతు

జి.కొండూరు: పాడి రైతులకు ప్రభుత్వం నుంచి సరైన భరోసా లేకపోవడంతో పాడి పరిశ్రమ గణనీయంగా తగ్గిపోతోంది. పశువులకు ప్రమాద బీమా పథకంలో మార్పులు చేయడంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉచిత పశు బీమాను మూడేళ్ల కాల పరిమితితో రైతు వాటా ప్రీమియం చెల్లింపు దిశగా మార్పులు చేయడంతో దీనిపై రైతులు ఆసక్తి చూపడం లేదు. బీమా చేయించేందుకు ప్రభుత్వం విధించిన అతి తక్కువ టార్గెట్‌లను పూర్తి చేయడం కూడా అధికారులకు కష్టతరంగా మారిపోయింది. దీనితో ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధులు ప్రబలినప్పుడు పశువులు మృత్యువాత పడి రైతులు ఆర్థికంగా నష్టాలను చవిచూస్తున్నారు. ఉచిత బీమాను అమలు చేస్తే ప్రతి పాడి రైతుకు లబ్ధి చేకూరుతుందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పశు బీమా ఇలా..

పశు బీమా పథకంలో భాగంగా బీమా చెల్లించిన రైతుకు చెందిన పశువు ప్రమాదవశాత్తూ మరణిస్తే ప్రభుత్వం నుంచి రూ.30 వేలు అందుతుంది. ఈ పథకంలో మూడేళ్ల కాల పరిమితికి గాను ప్రీమియంగా రూ.1,920గా నిర్ధారించారు.

మైలవరం నియోజకవర్గంలో పశు సంపద వివరాలు..

మండలం	గేదెలు	ఆవులు
జి.కొండూరు	13,179	607
మైలవరం	13,766	1,043
ఇబ్రహీంపట్నం	10,137	503
రెడ్డిగూడెం	16,570	1,186
విజయవాడ రూరల్	15,806	2,936

చెల్లించాల్సిన ప్రీమియంలో కేంద్ర ప్రభుత్వం వాటాగా 51 శాతం అంటే రూ.979 చెల్లిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 34 శాతం అంటే రూ.653లను చెల్లిస్తోంది.

దీనిలో రైతు వాటాగా 15 శాతం అంటే రూ.288 చెల్లించాల్సి ఉంది.

అదేవిధంగా రూ.50 వేలు బీమా నగదు పొందాలంటే రైతు వాటా ప్రీమియం చెల్లింపు రెట్టింపు అవుతుంది. ఈ పథకం వల్ల బీమా చెల్లించిన ఒక శాతం మంది రైతులకే లబ్ధి చేకూరుతుంది.

నియోజకవర్గంలో పశు బీమా టార్గెట్‌లు, ఇప్పటి వరకు పూర్తయిన బీమా వివరాలు

మండలం	టార్గెట్ ప్రీమియం	పూర్తయిన ప్రీమియం	బీమా పొందిన పశువులు
	రూ.	రూ.	
జి.కొండూరు	97,337	71,616	45
మైలవరం	97,338	88,992	56
రెడ్డిగూడెం	97,338	95,616	60
ఇబ్రహీంపట్నం	97,339	92,832	59
విజయవాడ రూరల్	91,930	1,17,792	74

ఉచితంగా ఇస్తే మేలు

పశు బీమా పథకంలో భాగంగా గతంలో రైతులకు ఉచిత బీమాను అందించేవారు. రూ.30 వేల బీమాకు గానూ చెల్లించాల్సిన ప్రీమియం రూ.1,920లను రాష్ట్ర ప్రభుత్వమే ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లించేది. పశువు ప్రమాదవశాత్తూ మరణిస్తే పశు వైద్యాధికారులు నిర్ధారించి రైతు వివరాలను ఆన్‌లైన్ చేస్తే రైతుకు నేరుగా బీమా నగదు అందేది. కానీ ప్రస్తుత తీరు అందుకు భిన్నంగా ఉంది. రైతు వాటా ప్రీమియం ఏడాది కాలానికి కాకుండా మూడేళ్ల కాల పరిమితి పెట్టడంతో రైతులు ఆసక్తి చూపడంలేదు. పాల దిగుబడిలో వ్యత్యాసాలు, ఆర్థిక అవసరాలను బట్టి ఒక ఏడాది కాలం తర్వాత పశువులను ఉంచుకుంటారో, అమ్ముకుంటారో గ్యారంటీ లేదు. కాబట్టి రైతులు ఈ బీమాను తీసుకునేందుకు ముందుకు రావడంలేదు. కాబట్టి ఉచిత బీమా అందిస్తే మేలని రైతులు పేర్కొంటున్నారు.

ఉచిత బీమా అమలు చేయాలి



పశువులకు ఉచిత బీమా అమలు చేస్తే ప్రతి పాడి రైతుకు మేలు జరుగుతుంది. గతంలో పశువు చనిపోతే రూ.30 వేలు ఇచ్చే వారు. ఇప్పుడు మూడేళ్ల కాల పరిమితితో రైతు వాటాగా రూ.288 చెల్లించాలని చెబుతున్నారు. దీని వల్ల బీమా చెల్లించిన రైతుకే మేలు జరుగుతుంది. ఉచిత బీమా అమలు చేసి ప్రోత్సహిస్తేనే పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది.

– కలగాని రమేష్, పాడి రైతు, మునగపాడు, జి.కొండూరు మండలం

రైతు వాటా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి



పశువులకు బీమా విషయంలో మార్పులు చేసి మూడేళ్ల కాల పరిమితితో రైతు వాటా ప్రీమియం చెల్లించే పద్ధతి అమలు చేయడం వల్ల కొందరికే మేలు జరుగుతుంది. ఉచిత బీమా అమలు చేస్తే ప్రతి పాడి రైతు లబ్ధి పొందుతారు. రైతు వాటాను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి ఉచితంగా బీమా ఇవ్వాలి.

–నెమలికంటి శేషయ్య, జూపూడి పెద్దిలంక, ఇబ్రహీంపట్నం మండలం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ప్రజా సమస్యలపై అధికారులు అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

నిత్య జీవితంలో నీరు ఎంతో అవసరం

మైలవరం: నిత్య జీవితంలో నీరు ఎంతో అవసరమని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్షా కాలం రాక ముందే ఇంకుడు గుంతలను శుభ్రం చేసుకుని కొత్త వాటిని నిర్మించుకోవాలని సూచించారు. ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి. శివహరి ప్రసాద్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి కళాశాల ఆవరణలోని ఇంకుడ గుంతలను శుభ్రం చేశారు. నీటిని నిల్వచేసే అంశంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి. శివహరిప్రసాద్, ఉమామహేశ్వరరెడ్డి, సివిల్ విభాగం ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి ఈశ్వర్‌రామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

12మంది జూదరుల అరెస్ట్

కంచికచర్ల: మండలంలోని మోగులూరులో పేకాడుతున్న 12 మందిని కంచికచర్ల పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 22,350 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ బోనగిరి రాజు మాట్లాడుతూ పేకాట, క్రికెట్ బెట్టింగ్, జూదం ఆడేవారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నికపై ఉత్కంఠ

- ఆర్డీఓ ఆధ్వర్యంలో నేడు తిరువూరు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం
- పోలీసు బందోబస్తు మధ్య ఎన్నిక
- జోరుగా ఊహాగానాలు ప్రచారం



చైర్‌పర్సన్ ఎన్నికకు కౌన్సిల్ హాల్‌లో ఏర్పాట్లు చేస్తున్న కమిషనర్, సిబ్బంది

తిరువూరు: మరో 10 నెలల్లో ముగియనున్న తిరువూరు నగర పంచాయతీ పాలకవర్గానికి చైర్‌పర్సన్ ఎన్నిక సోమవారం జరుగనుంది. వైఎస్సార్ సీపీ గెలుచుకున్న తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్‌ను దొడ్డిదారిలో చేజిక్కించుకునేందుకు తెలుగుదేశం పార్టీ చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతమయ్యే సూచనలు కనిపించడం లేదు. కౌన్సిల్‌లో ఎటువంటి బలం లేకపోయినా తెలుగుదేశం పార్టీ నాయకులు చైర్‌పర్సన్ ఎన్నికలో తామే గెలుస్తామంటూ గత వారం రోజులుగా ఊహాగానాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లందరూ తమకు మద్దతు తెలుపుతారని, కౌన్సిల్ తమకే దక్కుతుందంటూ స్థానిక నాయకులు హడావుడి చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మాత్రం తమ అధినాయకత్వం సూచనల మేరకు ఎన్నికలో పాల్గొంటామని చెబుతున్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు కౌన్సిలర్లకు దిశా నిర్దేశం చేశారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నికపై పట్టణ రాజకీయ వర్గాల్లో సైతం జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి.

ఎన్నికల ప్రక్రియకు చర్యలు

చైర్‌పర్సన్ ఎన్నికకు తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి మాధురి ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. నిబంధనల మేరకు కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌ను ఎన్నుకునేందుకు కౌన్సిల్‌హాల్లో సీటింగ్ ఏర్పాట్లు చేశారు. 20 మంది కౌన్సిలర్లలో ఐదో వార్డు సభ్యురాలు అనుమోలు రమాదేవి విదేశాల్లో ఉండగా మిగిలిన 19 మంది ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటారు. వైఎస్సార్ సీపీకి 17 మంది కౌన్సిలర్లుండగా, టీడీపీకి ముగ్గురు కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడైన ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఓటు హక్కు కలిగి ఉన్నారు.

ఆపరేషన్ సిందూర్‌తో సత్తా చాటాం



చాట్రాయిలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రి పార్థసారథి

చాట్రాయి: ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌పై భారత్ తన సత్తా చాటిందని గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం మండలంలోని చాట్రాయిలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మన సైన్యం పాక్ ఉగ్రవాదులను అంతమొందించి విజయం సాధించడం దేశానికి గర్వకారణమని అన్నారు. అనంతరం జాతీయ జెండాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ మినీ వ్యాన్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ రవాణా రంగ కార్మికుల శ్రేయస్సు కోసం ఈ నెల 20న రాష్ట్ర స్థాయి సదస్సు ఇబ్రహీంపట్నంలో నిర్వహిస్తామన్నారు. రవాణా రంగ కార్మికుల శ్రేయస్సు కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, నూతన వాహనాల కొనుగోలుకు సబ్సిడీతో కూడిన బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా రంగంలో ట్రాఫిక్ నిబంధనల పేరుతో వేస్తున్న వేలాది రూపాయల జరిమానాలు కట్టలేక వాహన యజమానులు కుదేలవుతున్నారన్నారు. రవాణా రంగ కార్మికుల సమస్యలు రాష్ట్ర సదస్సులో చర్చిస్తామని చెప్పారు. యూనియన్ నాయకులు సురేష్ వర్మ, నాగరాజు, రాము, శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు మేకా ప్రతాప్ పరామర్శ



నూజివీడు: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మంతెన అజయ్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం రాత్రి పరామర్శించారు. ఈనెల 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని హనుమంతుల గూడెంకు చెందిన మంతెన అజయ్ మృతిచెందాడు. మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రతాప్ అప్పారావుతో పాటు వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి కంచర్ల లవకుమార్, సర్పంచి యంత్రపాటి మల్లయ్య, నాయకులు ప్రత్తిపాటి జోజి, యంత్రపాటి రవికిరణ్, దారా సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



తుప్పపట్టి పెచ్చులూడిన విద్యుత్ స్తంభం

ముసునూరు: చెక్కపల్లి ప్రధాన సెంటర్‌లో విద్యుత్ స్తంభం విరిగి ప్రమాదకరంగా మారింది. విద్యుత్ సరఫరా మెయిన్ లైన్ స్తంభం ప్రమాదకరంగా ఉన్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఏ సమయంలో ఏం జరుగుతుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. ఈ ప్రదేశానికి సమీపంలో ప్రభుత్వ పశు వైద్యశాల, సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, సాయిబాబా గుడి, పలు షాపులు ఉన్నాయి. ఇటీవల గాలీవానకు చెట్టు విరిగి ఇంటిమీద పడడంతో బాలుడు మృతి చెందిన ఘటన తెలిసిందే. మరోసారి అలాంటి ఘోరం జరగక ముందే ఈ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం వేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై రమణక్కపేట సెక్షన్ ఏఈ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా, తమ సిబ్బందిని పంపి స్తంభం మార్పిస్తామని చెప్పారు.

గ్యాస్ లీకేజీతో ఇక్కట్లు

ఆగిరిపల్లి: స్థానిక యూనియన్ బ్యాంక్ ఏటీఎం కేంద్రం వద్ద గ్యాస్ లీకేజీ సమస్యతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. యూనియన్ బ్యాంక్ ఏటీఎం కేంద్రం వద్ద మేఘా గ్యాస్ సంస్థ పైప్ లైన్ ఏర్పాటు చేశారు. సంవత్సరం నుంచి అక్కడ ఏర్పాటు చేసిన పైపుల నుంచి గ్యాస్ లీక్ అవుతోంది. దీంతో ఏటీఎం కేంద్రం దగ్గరికి నగదు కోసం వెళ్లిన వినియోగదారులు గ్యాస్ వాసనతో తల తిప్పటం, కళ్లు మండటం వంటి ఇబ్బంది పడుతున్నారు. ఇటు బ్యాంకు అధికారులు కానీ, మేఘా సంస్థ కానీ పట్టించుకోకపోవడం లేదు. ఏటీఎం కేంద్రానికి ఆనుకుని టీ స్టాల్ ఉంది. గ్యాస్ లీక్ అవ్వడం వల్ల ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులని, గ్యాస్ లీక్ కాకుండా మరమ్మతులు చేయాలని ప్రజలు, ఖాతాదారులు కోరుతున్నారు.

నూజివీడులో కొవ్వొత్తులతో ర్యాలీ



రాజీవ్ సర్కిల్ వద్ద కొవ్వొత్తులతో స్నేహ రైట్స్ సిబ్బంది ప్రదర్శన

నూజివీడు: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్నేహ రైట్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ బసవరాజు నగేష్ అన్నారు. అంతర్జాతీయ క్యాండిల్ లైట్ మెమోరియల్ డేను పురస్కరించుకుని ఆదివారం నూజివీడు రాజీవ్ సర్కిల్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. ఎయిడ్స్ రోగుల పట్ల వివక్షత చూపవద్దని, వారిని ఆదరించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించారు.



కొండపల్లిలో కురుస్తున్న వర్షం

భారీ వర్షం

రోడ్లు జలమయం

ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో ఇబ్రహీంపట్నం. కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో రోడ్లు జలమయమయ్యాయి. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం ప్రారంభం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై ప్రవహించిన వర్షం నీటితో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు. పలు వీధుల్లో కాలువలు, డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

–ఇబ్రహీంపట్నం



ఇబ్రహీంపట్నం జాకీర్ హుస్సేన్ కళాశాల రోడ్డులో వర్షం నీటిలో బైక్‌ను నడిపించుకు వెళుతున్న వాహనదారుడు



ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ సమీపంలో 30వ నంబర్ జాతీయ రహదారిపై వర్షంలో వెళుతున్న వాహనాలు

22న హనుమత్ జయంతి వేడుకలు

నందిగామరూరల్: మండలంలోని కె.కంచ్రిక గ్రామంలో వేంచేసిఉన్న దాసాంజనేయస్వామి వారి ఆలయంలో ఈ నెల 22న హనుమత్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ మేడా రామారావు ఆదివారం తెలిపారు. వేడుకల్లో భాగంగా స్వామివారికి పంచామృతాభిషేకం, నాగవల్లి అర్చన, లక్ష్మీగణపతి, నవగ్రహ, రుద్రమన్యుసూక్త శ్రీరామ మహా మంత్ర హోమం, మహా పూర్ణాహుతి పూజలు నిర్వహిస్తామని వివరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

చీరల వేలం

నందిగామరూరల్: లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారికి చీరల వేలం ద్వారా రూ. 40,100 ఆదాయం వచ్చిందని ఈఓ నరసింహమూర్తి తెలిపారు. లింగాలపాడు గ్రామంలోని లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం చీరల వేలం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం వేలం నిర్వహించామని వివరించారు.